PRGI REGD NO: TGTEL/25/A1385

Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com




మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



| సోమవారం MONDAY 3-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 |
|---|---|---|---|
| | సంపుటి: 2 Volume:2 | సంచిక: 35 Issue: 35 | |


03 ఆగస్టు 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి పంచమి రా. 10:51 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర రా. 9:47 వరకు తరువాత రేవతి యోగం సుకర్మ రా. 9:07 వరకు కరణం కౌలవ ఉ. 11:06 వరకు తైతుల రా. 10:51 వరకు వర్జ్యం ఉ. 7:22 నుండి ఉ. 9:00 వరకు దుర్ముహూర్తం మ. 12:47 నుండి మ. 1:38 వరకు మ. 3:20 నుండి సా. 4:11 వరకు రాహుకాలం ఉ. 7:35 నుండి ఉ. 9:11 వరకు యమగండం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు గుళికాకాలం మ. 1:57 నుండి మ. 3:33 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు సా. 5:07 నుండి సా. 6:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# సల్లంగ సూడు తల్లీ!

## ఘనంగా లష్కర్ బోనాలు.. అమ్మవారిని దర్శించుకున్న సీఎం, ప్రజాప్రతినిధులు

### ప్రత్యేక ఆకర్షణగా హీరోయిన్ వైష్ణవి చైతన్య... నేడు అమ్మవారి భవిష్యవాణి 'రంగం' కార్యక్రమం

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

సికింద్రాబాద్, ఆగస్టు 2 (ఈవార్తలు): తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వర్షాలు కురవాలని కోరుకున్నా: కేటీఆర్**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు తరువాయి 2 వ పేజీలో...






# వద్దు నశా!

## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం... యువతకు ప్రధాని మోదీ పిలుపు

### వికసిత భారత్‌లో 'నశా ముక్త్ యువ' ప్రారంభం.. ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాలు

దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభి యాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు.

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. -2 వ పేజీలో...




## రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలోచనలో సీజేపీ.. ఈ నెల 5న కీలక నిర్ణయం తీసుకునే చాన్స్

### దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ భేటీ.. సమావేశం తర్వాత మీడియా ముందుకు

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు.

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,422 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,041 |



## స్టాక్ మార్కెట్లకు కొత్త టైం

### నేటి నుంచి అమల్లోకి కొత్త ట్రేడింగ్ సమయాలు

### డెరివేటివ్స్ ట్రేడింగ్ సాయంత్రం 3:40 వరకు పొడిగింపు

2



# రంగనాథ్ కోసం ర్యాలీ

## కొనసాగించాలంటూ హైదరాబాద్‌లో ర్యాలీలు

### చెరువుల పరిరక్షణ చర్యలను స్వాగతించిన నగరవాసులు

### రెండేళ్లలో రూ. 1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిందని ప్రశంసలు

హైదరాబాద్, ఆగస్టు 2 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో...

# రాహుల్.. వచ్చి సారీ చెప్పు



### ఇంజనీర్లు క్రిమినల్ వేస్ట్ అని రేవంత్ అనడం దుర్మార్గం

### యువతతో పెట్టుకుంటే ఏమైతదో కాంగ్రెస్‌కు తెల్వదా?

### వెంటనే మౌనం వీడి భేషరతుగా క్షమాపణ చెప్పాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

ఇంజనీరింగ్ విద్యార్థులనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభ్యంతరకర కామెంట్స్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, పార్టీ నేత రాహుల్‌కు కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఇంజనీరింగ్ విద్యార్థులను, ఇంజనీర్లను "క్రిమినల్ వేస్ట్" అన్న ముఖ్యమంత్రి కామెంట్స్‌పై రాహుల్ మౌనం వీడి క్షమాపణ చెప్పాలని, లేదంటే రేవంత్ వ్యాఖ్యలను సమర్థించినట్టే అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తేల్చి చెప్పారు.

హైదరాబాద్, ఆగస్టు 2 (ఈవార్తలు): ఇంజనీర్లు, భారతదేశ ఇంజనీర్లు ప్రపంచ కంపెనీలను నడుపుతుంటే, అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతుంటే.. అలాంటి వారిని "క్రిమినల్ వేస్ట్" అని రేవంత్ రెడ్డి అంటున్నారని, దేశ ప్రగతికి పాటుపడుతూ లక్షల మందికి ఉద్యోగ ఉపాధిని అందిస్తున్న ఇంజినీర్లను రేవంత్ అవమానపరిచారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పైన స్పందించాల్సిన నైతిక, -2 వ పేజీలో...

## విశ్వవాణి



కీటకాల దాడి, బలమైన గాలులు లేదా కొమ్మలు కత్తిరించడం వల్ల మొక్కలకు గాయమైనప్పుడు, దెబ్బతిన్న భాగాన్ని త్వరగా పునరుద్ధరించేందుకు మొక్కలు చక్కెరలను (షుగర్స్) గాయం ఉన్న ప్రాంతానికి తీసుకెళ్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. పరిశోధకుల వివరాల ప్రకారం, మొక్కలు కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింథసిస్) ద్వారా చక్కెరలను ఉత్పత్తి చేస్తాయి. అయితే అవి మొక్క అంతటా సమానంగా పంపిణీ కాకుండా, గాయం అయిన వెంటనే అక్కడికి అవసరమైన శక్తిని చేరవేసేలా ప్రత్యేక వ్యవస్థ పనిచేస్తుంది.

# ఇరాన్-అమెరికా యుద్ధానికి బ్రేక్



### శాంతి ఒప్పందం కుదిరిందన్న ట్రంప్.. దాడులను రద్దు చేసుకున్నట్టు ప్రకటన

### హర్మూజ్ తెరవాలని కీలక షరతు.. అమెరికా తేడా చేస్తే తిప్పి కొడతాం: ఇరాన్

ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య ప్రకటన చేశారు. ఇరాన్‌పై వారాంతంలో జరపాల్సిన దాడులను రద్దు చేసుకున్నట్టు ఆదివారం వెల్లడించారు. ఇరాన్‌తో పాటు ఇతర పశ్చిమాసియా దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఓ ఒప్పందానికి సంబంధించిన పరిమితులపై అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు. అయితే, ఈ ఒప్పందం వేగంగా ఖరారైతేనే దాడుల విరమణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

టెహ్రాన్/వాషింగ్టన్: 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వివరాలు పంచుకున్నారు. త్వరలో కుదరబోయే ఒప్పందం ప్రకారం.. హర్మూజ్ జలసంధిని తక్షణమే, సంపూర్ణంగా తెరవడంతో పాటు, ఇరాన్ అణు ముప్పునకు ముగింపు పలకాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "ఒప్పందం పరిమితులపై అంగీకారం కుదిరినందున, ఎటువంటి దాడికి పాల్పడవద్దని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు మమ్మల్ని కోరాయి. ఈ విజ్ఞప్తి తరువాయి 2 వ పేజీలో...

# హై సెక్యూరిటీగా రేషన్ కార్డులు

## త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ



ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత ఆధునీకరించి, రేషన్ సరుకుల విక్రయంలో జరుగుతున్న దళారీ వ్యవస్థ, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక నూతన విప్లవాత్మక విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పదేళ్లుగా ఉపయోగిస్తున్న కాగితపు రేషన్ కార్డుల స్థానంలో భద్రత, బహుళ ప్రయోజనాలు కలిగిన పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ సమగ్ర కార్యాచరణను పూర్తి చేసింది.

హైదరాబాద్, ఆగస్టు 2 (ఈవార్తలు): ఏటీఎం కార్డు తరహాలో ఉండే ఈ డిజిటల్ స్మార్ట్ కార్డులు ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయాలకు చేరుకున్నాయి. గతంలో ఉన్న పాత కార్డులు నలిగిపోవడం, తడిసి పాడైపోవడం వల్ల లబ్ధిదారులు నెట్‌సెంటర్లలో ఆన్‌లైన్ ప్రింట్లు తీసుకుని తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీలలో భాగంగా అర్హులైన నిరుపేదలందరికీ కొత్త డిజిటల్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. దానికి అనుగుణంగా తయారు చేసిన కొత్త స్మార్ట్ కార్డు ముందు భాగంలో కుటుంబ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

3.8.2026

**మేషం:** అనుకున్న వ్యవహారాలు ముందుకు సాగవు. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. కొన్ని విషయాలలో బంధువులు, మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆర్థిక సమస్యలు సతమతం చేస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**వృషభం:** సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. సోదరుల నుంచి ధన సహాయం అందుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి.

**మిధునం:** ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వాహనయోగం ఉన్నది. పనులలో అవాంతరాలు అధిగమిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

**కర్కాటకం:** ముఖ్యమైన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

**సింహం:** ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఇంటాబయటా సమస్యలు బాధిస్తాయి. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉంటాయి.

**కన్య:** చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. బంధువులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కుటుంబ సభ్యులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగాలలో బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారు.

**తుల:** చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులు కష్టపడ్డా ఫలితం ఉండదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక చికాకులు కలుగుతాయి. ముఖ్య వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన సమస్యలు ఎదురవుతాయి.

**వృశ్చికం:** గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక వ్యవహారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. కొనుగోలు ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పని చేసి అధికారుల అనుగ్రహం పొందుతారు.

**ధనస్సు:** కీలక వ్యవహారాలు మందగిస్తాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. సోదరులతో అకారణ కలహ సూచనలు ఉన్నవి. నూతన ఋణ యత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

**మకరం:** అనుకున్న పనులు అనుకున్న రీతిలో సాగుతాయి. మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి చేసే ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ప్రభుత్వ అధికారులతో చర్చలు సఫలమవుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక మార్పులు కలుగుతాయి.

**కుంభం:** నిరుద్యోగులకు నూతన ఉద్యోగాలు దక్కుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. నూతన ఋణయత్నాలు చేస్తారు. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది.

# సల్లంగ సూడు తల్లీ!

మొదటి పేజీ తరువాయి

కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు పేర్కొన్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా వైష్ణవి చైతన్య

సినీ నటి వైష్ణవి చైతన్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ బోనాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆమె సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి వచ్చిన వైష్ణవి చైతన్యకు భక్తులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో కొంతసేపు ప్రార్థనలు చేసిన ఆమె, కుటుంబ సభ్యుల సంక్షేమంతో పాటు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిసింది. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కాగా, సోమవారం ఉదయం భవిష్యవాణి కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాల ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.

# రాహుల్.. వచ్చి సారీ చెప్పు

మొదటి పేజీ తరువాయి

రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని. ఈ అంశంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉండడం అంటే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థించినట్లే అని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో పాటు ఇంతటి దిగజారుడు ముఖ్యమంత్రిని రాష్ట్రంలోకి పంపిన రాహుల్ గాంధీ సైతం రాజీనామా చెప్పాలని ఆయన డిమాండ్. చేశారు. 'నేటి యువత రేపటి భారతదేశ నిర్మాతలు' అన్న విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలని కేటీఆర్ సూచించారు. యువతతో పెట్టుకుంటే ఏమైందో రాహుల్ గాంధీ నానమ్మ ఇందిరమ్మకు ఎమర్జెన్సీ సమయంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో యూపీఏ ప్రభుత్వానికి తెలుసని ఆయన గుర్తు చేశారు. యువత తలుచుకుంటే తమ పార్టీ మెడలు ఎలా వంచుతారో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గుర్తుంచుకోవాలి. తెలంగాణ యువత ఓట్లు అడిగి వారిని మభ్యపెట్టిన రాహుల్ గాంధీకి తన నైతిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ లేఖ రాస్తున్నా. రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్ పైన స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్ గాంధీపై ఉన్నది. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, నైతికత.. యువతకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలపైన మాట్లాడే అర్హత కోల్పోయారు. యువత గురించి రాహుల్ గాంధీ చెప్పే ఊకదంపుడు ప్రసంగాలకు భిన్నంగా రేవంత్ రెడ్డి విద్యార్థులను, ఇంజినీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నాడు. ఇప్పటిదాకా రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డిని క్షమాపణ చెప్పాలని ఆదేశించకపోవడం, రేవంత్ రెడ్డి తరఫున రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోవడం.. ఆ వ్యాఖ్యలను సమర్థించినట్లే. కేవలం ప్రసంగాలతో నాయకత్వం స్థాయి పెరగదని రాహుల్ గాంధీ గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ విధానాలతోనే చేసిన తప్పులను సరిదిద్దుకోవడంతోనే పెరుగుతుందని గుర్తించి రాహుల్ గాంధీ స్పందించాలి. తమ పార్టీ ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలకు విద్యార్థులకు, గురువులకు, ఇంజినీర్లకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తనకు సంబంధం లేదని రాహుల్ గాంధీ చెప్పజాలడు. యువత గురించి ఊకదంపుడు ప్రసంగాలు చేసే హక్కు రాహుల్ గాంధీకి లేదు. . ఇదే తెలంగాణ యువత కేసీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నారని రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలి. దేశ ప్రగతికి పాటుపడుతున్న ఇంజినీర్లు క్రిమినల్ వేస్ట్ అనడమే కాంగ్రెస్ పార్టీ విధానమా? రాహుల్ చెప్పాలి. తెలంగాణ యువత మీ ముఖ్యమంత్రి చేస్తున్న అడ్డమైన వ్యాఖ్యలను గమనిస్తోంది, గుర్తుంచుకుంటుంది. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థులనే కాకుండా ఇంజినీరింగ్ టీచర్లను తప్పుగా మాట్లాడారు. యువతపైన, విద్యార్థులపైన అడ్డగోలుగా నోరు పారేసుకోవడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారింది. తెలంగాణ యువత ఆత్మగౌరవం పైన, ఆత్మవిశ్వాసం పైన రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు. దేశ ప్రగతి కోసం తమ జీవితాన్ని ధారపోస్తున్న అధ్యాపక గురువులను కూడా రేవంత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడారు. రేవంత్ రెడ్డి గతంలో ఇలాగే యూనివర్సిటీ విద్యార్థులను "బీరు బిర్యానీ బ్యాచ్" అన్నారు. వారి రాజకీయ ఉద్యమాలను తక్కువ చేసి మాట్లాడారు. ఎవరు ప్రశ్నిస్తే వారిని తిట్టడం రేవంత్‌కి అలవాటు అయింది. విద్యార్థులను, ఇంజినీర్లను, టీచర్లను క్రిమినల్ వేస్ట్ అంటున్నాడు. రేవంత్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యలే కాబట్టి, రాహుల్ గాంధీ అన్ కండిషనల్ క్షమాపణ విద్యార్థులకు, యువతకు చెప్పాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం వెంటనే విద్యార్థులకు, గురువులకు క్షమాపణ చెప్పాలి. ఇంజినీర్లు, గురువులు క్రిమినల్ వేస్ట్ కాదు.. యువతను అడుగడుగునా, నిలువునా మోసం చేసిన కాంగ్రెస్సే అసలు సిసలు క్రిమినల్ వేస్ట్! విద్యార్థులను, ఇంజినీర్లను క్రిమినల్ వేస్ట్ అన్న రేవంత్ మాటలు ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ మాటలే. ఇప్పటికే మీ హామీల పేరుతో మోసపోయిన యువత అన్ని గుర్తుంచుకుంటుంది. సరైన సమయంలో తగిన సమాధానం చెబుతుందని గుర్తుంచుకోవాలి అని తన లేఖలో కాంగ్రెస్ పార్టీని కేటీఆర్ హెచ్చరించారు.

# స్టాక్ మార్కెట్లకు కొత్త టైం

## నేటి నుంచి అమల్లోకి

## 3:40 వరకు పొడిగింపు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ వ్యవస్థలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇన్వెస్టర్లకు మెరుగైన అవకాశాలు కల్పించడం, మార్కెట్ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఈ కొత్త నిబంధనలు సోమవారం, ఆగస్టు 3 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల్లో భాగంగా ఈక్విటీ డెరివేటివ్స్ ట్రేడింగ్ సమయాన్ని పొడిగించడంతో పాటు, ఎఫ్ అండ్ ఓ విభాగంలో ఉన్న స్టాక్స్‌కు ప్రత్యేకంగా 'క్లోజింగ్ ఆక్షన్ సెషన్'ను ప్రవేశపెట్టారు. తాజా నిబంధనల ప్రకారం, ఎఫ్ అండ్ ఓ విభాగంలోని స్టాక్స్ (క్యాష్ సెగ్మెంట్)కు రెగ్యులర్ ట్రేడింగ్ మధ్యాహ్నం 3:15 గంటలకు ముగుస్తుంది. ఆ తర్వాత ప్రత్యేకంగా క్లోజింగ్ ఆక్షన్ సెషన్ మొదలవుతుంది. ఈ సెషన్‌లో కనుగొన్న ధరనే ఆ రోజుటి అధికారిక ముగింపు ధరగా పరిగణిస్తారు. అయితే, నాన్-ఎఫ్ అండ్ ఓ ఈక్విటీ క్యాష్ స్టాక్స్ ట్రేడింగ్ విషయంలో ఎలాంటి మార్పులు లేవని, యథావిధిగా మధ్యాహ్నం 3:30 గంటలకు ముగుస్తుందని సెబీ స్పష్టం చేసింది. మరో కీలక మార్పుగా, ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ సమయాన్ని 10 నిమిషాలు పొడిగించారు. దీంతో ట్రేడింగ్ సాయంత్రం 3:40 గంటల వరకు కొనసాగుతుంది. అలాగే, ప్రీ-ఓపెన్ సెషన్‌లో కూడా స్వల్ప మార్పులు చేశారు. ఉదయం 9:00 నుంచి 9:07 గంటల వరకు మాత్రమే ఆర్డర్ ఎంట్రీ విండో అందుబాటులో ఉంటుంది. 9:07 నుంచి 9:15 మధ్య ఆర్డర్లు మ్యాచ్ అవుతాయి. యథావిధిగా 9:15 గంటలకు రెగ్యులర్ ట్రేడింగ్ ప్రారంభమవుతుంది.

# ఇరాన్-అమెరికా యుద్ధానికి బ్రేక్

మొదటి పేజీ తరువాయి

ఆధారంగా, ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా దాడిని రద్దు చేసేందుకు అంగీకరించాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. గత ఐదు నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే ఈ ఒప్పందం పూర్తి చేసే ప్రయత్నంలో అమెరికాతో చేతులు కలిపేందుకు ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై ఇజ్రాయెల్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు, అమెరికా ఎలాంటి సాహసోపేత చర్యలకు పాల్పడవద్దని టెహ్రాన్ ఈ వారాంతంలో తీవ్రంగా హెచ్చరించింది. ఇరాన్ లక్ష్యాలపై కొత్త దాడులు చేస్తామన్న ట్రంప్ బెదిరింపులను నిజం చేస్తే, నిర్ణయాత్మకంగా ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. శనివారం టర్కీ, పాకిస్థాన్, సౌదీ అరేబియా ఉన్నతాధికారులతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు.

# రంగనాథ్ కోసం ర్యాలీ

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి. అమీర్‌పేట, మధురా నగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి. గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు. కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. రేవంత తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.



# వద్దు నశా!

మొదటి పేజీ తరువాయి

"కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.




# ఎటు దిశ!?

మొదటి పేజీ తరువాయి

కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# హై సెక్యూరిటీగా రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

యజమాని ఫొటోతో పాటు ప్రత్యేకమైన రేషన్ కార్డు సంఖ్యను స్పష్టంగా ముద్రించారు. కార్డు వెనుక భాగంలో అధునాతన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల పేర్లు, వారి వయస్సు, ఆధార్ అనుసంధాన వివరాలు క్షణాల్లో తెలుసుకునే సాంకేతికతను రూపొందించారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్టంలో లేదా దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా వన్ నేషన్ - వన్ రేషన్ విధానం కింద ఏ రేషన్ దుకాణంలోనైనా సరుకులు సులభంగా పొందే వీలుంటుంది. క్యూఆర్ కోడ్ ఆధారంగా వేలిముద్రలు, ఐరిస్ స్కాన్ నిర్వహించి సరుకులు కేటాయిస్తారు. ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉన్న అర్హులైన లబ్ధిదారుల సమాచారం, కొత్తగా దరఖాస్తు చేసుకున్న డేటా ఆధారంగా ఈ స్మార్ట్ కార్డుల ముద్రణను వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలకు రవాణా చేశారు. ఈ నూతన విధానంపై పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. జిల్లాలకు ఇప్పటికే సరిపడా పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల స్టాక్ చేరుకుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి పంపిణీ ప్రారంభ తేదీలు, మార్గదర్శకాలు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులకు వీటిని అందజేస్తామని వెల్లడించారు. ఈ కొత్త కార్డుల రాకతో కార్డుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడటంతో పాటు నిరుపేదలకు నాణ్యమైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



# రక్ష క్లినిక్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

## దాదాపు 100 మందికి పరీక్షలు.. ఉచితంగా మందులు పంపిణీ

ఖమ్మం, ఆగస్టు 2 (ఈవార్తలు): ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో శ్రీ శ్రీ శ్రీ హోటల్ సమీపంలో ఉన్న రక్ష క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మాజీ కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. వర్షాకాలంలో జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, ఒళ్లనొప్పులు, నీరసం, తలనొప్పి వంటి సీజనల్ వ్యాధులు అధికమవుతున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో దాదాపు 100 మంది వైద్య పరీక్షలు చేయించుకుని ఉచిత వైద్య సేవలు పొందారు. ప్రముఖ గుండెజబ్బుల వైద్య నిపుణుడు, మధుమేహ నిపుణుడు డాక్టర్ కిరణ్ కుమార్ గుడిగొండ ప్రతి రోగిని స్వయంగా పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేశారు. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, జ్వరానికి సంబంధించిన రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స, జీవనశైలి, ఆహార నియమాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ గుడిగొండ మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, ఒళ్లనొప్పులు, తీవ్రమైన నీరసం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటు ఖర్చుతో అందించాలనే లక్ష్యంతో రక్ష క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి కొనసాగిస్తామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇలాంటి సేవలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. డాక్టర్ కిరణ్ కుమార్ గుడిగొండ సేవా దృక్పథాన్ని కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి ఆకెన పవన్, చింతల రమేష్, తుమ్మల సురేష్, మట్టా వెంకటేశ్వరరావు, నల్లమోతు రామకృష్ణ, మండేపూడి కృష్ణయ్య, పుసులూరి నాగేశ్వరరావు, నల్లమోతు శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది వరలక్ష్మి, ఉమ, ప్రవీణ్, హర్షిత తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలు ఉచిత వైద్య సేవలను అభినందిస్తూ, ఇలాంటి ఆరోగ్య శిబిరాలను తరచుగా నిర్వహించాలని నిర్వాహకులను కోరారు.





## శ్రీ సూర్య ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, ఆగస్టు 2 (ఈవార్తలు): ఆషాఢ మాస శుక్ల పక్ష చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ఉషా-ఛాయ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారికి ముడుపులు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఉచితంగా అమృత నిర్గుండి కషాయం పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, ఆదివారం సూర్య భగవానునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు అని, ఈ రోజున సూర్యారాధన చేయడం వల్ల ఆరోగ్యం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, విజయాలు సిద్ధిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, కోశాధికారి గోపి-స్వాతి, భారతల రాజసాగర్, యాంసాని శంకరయ్య, వేముల రాజేష్, ఎలిమేళ్ల సత్యనారాయణ, రెడ్డి, గంగమ్మ, నాగభూషణం, ఆలయ అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఇటు కుండపోత.. అటు ఉక్కపోత

**దేశంలో వింతగా రుతుపవనాలు**

**11 శాతం వర్షపాత లోటు నమోదు**

న్యూఢిల్లీ: దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. ప్రస్తుతం గుజరాత్, దాని పరిసర ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న వాతావరణ వ్యవస్థ కారణంగా అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, వాయువ్య భారతదేశంలో రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నాయి. అయితే, రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు కదిలే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

## దేశీయ కంపెనీలకు లక్షల కోట్లు

**గత వారం స్టాక్ మార్కెట్ల ర్యాలీతో భారీగా లాభం**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం బలమైన ర్యాలీ కొనసాగడంతో దేశంలోని టాప్-10 అత్యంత విలువైన కంపెనీలలో తొమ్మిది కంపెనీల సంపద భారీగా పెరిగింది. ఈ కంపెనీలన్నీ కలిసి ఒక్క వారంలోనే తమ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో (మార్కెట్ విలువ) ఏకంగా రూ.2.51 లక్షల కోట్లను జోడించుకున్నాయి. మార్కెట్ సూచీలైన సెన్సెక్స్ 2,034 పాయింట్లు (2.67%), నిఫ్టీ 616 పాయింట్లు (2.59%) లాభపడటం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ వారంలో లాభపడిన దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ & టూబ్రో, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) ఉన్నాయి. అయితే, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) మాత్రం ఈ జాబితాలో నష్టాలను చవిచూసిన ఏకైక కంపెనీగా నిలిచింది. అత్యధికంగా లాభపడిన కంపెనీగా బజాజ్ ఫైనాన్స్ రికార్డు సృష్టించింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ ఒక్క వారంలోనే రూ.80,345.97 కోట్లు పెరిగి రూ.7,10,817.51 కోట్లకు చేరింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 28% పెరగడమే ఈ ర్యాలీకి కారణం. ఈ వార్తతో శుక్రవారం ఒక్కరోజే కంపెనీ షేరు 8% పైగా పెరిగింది. ఇతర కంపెనీల విషయానికొస్తే.. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.44,959.5 కోట్లు పెరిగి రూ.12,30,005.63 కోట్లకు చేరింది. టీసీఎస్ రూ.40,414.03 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.39,447.35 కోట్లు చొప్పున లాభపడ్డాయి. లార్సెన్ & టూబ్రో రూ.21,096.8 కోట్లు, ఎస్‌బీఐ రూ.10,845.97 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.8,164.73 కోట్లు, ఎల్‌ఐసీ రూ.4,427.49 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,660.37 కోట్ల మేర తమ మార్కెట్ విలువను పెంచుకున్నాయి. మరోవైపు, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.10,326.46 కోట్లు తగ్గి రూ.4,93,602.13 కోట్లకు పడిపోయింది.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత ప్రతిజ్ఞ



హైదరాబాద్, ఆగస్టు 2 (పీఐబీ): దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'వ్యసన రహిత యువత కోసం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో భాగంగా మేరా యువ భారత్ (మై భారత్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష వర్చువల్ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మేరా యువ భారత్ ప్రతినిధులు, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) స్వచ్ఛంద సేవకులు, యువత 'వ్యసన రహిత ప్రతిజ్ఞ' చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు ఇతరులను కూడా ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అవలంబించేలా ప్రోత్సహిస్తామని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ పురుషోత్తం, పోలీసు ఉప పరిశీలకుడు విజయ్ భాస్కర్ రెడ్డి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి ప్రీతి జీవన్, జిల్లా సమాచార సాంకేతిక అధికారి మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థులు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు, యువత పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా యువజన అధికారి శశాంక్ రావుల మాట్లాడుతూ, యువత ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని, వ్యసన రహిత భారత్ - వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం మేరా యువ భారత్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## జేఎన్టీయూ రిజిస్ట్రార్‌పై ప్రభుత్వ కుట్రలు

**వర్సిటీల నియామకాల్లో జోక్యం వద్దు**

**సర్కారుకు విద్యార్థి సంఘాల హెచ్చరిక**

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2 (ఈవార్తలు): జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మిపై జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న ప్రభుత్వ కుట్రలను సహించబోమని, విశ్వవిద్యాలయాల్లో జరిగే నియామకాల్లో ప్రభుత్వ జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నామని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి జన సమితి రాష్ట్ర కమిటీ తరఫున డప్పు గోపి మాట్లాడుతూ, 54 ఏళ్ల జేఎన్టీయూ చరిత్రలో తొలిసారిగా ఓ మహిళ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారని, అదీ వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళ కావడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. రిజిస్ట్రార్ పదవిలో కొనసాగుతున్న ప్రొఫెసర్ జయలక్ష్మిని తొలగించేందుకు ప్రభుత్వానికి అనుకూలంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఇటువంటి చర్యలను విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తాయని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో వెనుకబడిన వర్గాల సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం సివిల్స్ అకాడమీ చైర్మన్ కొండ నాగేశ్వరరావు, విద్యార్థి నాయకులు కుమ్మరబోయిన సైదులు, భారీ అశోక్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



**విశ్వశాంతి హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు.. గురువులకు సన్మానం**

### స్నేహితుల దినోత్సవం వేళ

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రాయికల్, ఆగస్టు 2 (ఈవార్తలు): స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్‌లో 2000-2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని పాఠశాల రోజులను గుర్తు చేసుకున్నారు. ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు, ప్రధానోపాధ్యాయులు మచ్చ గంగాధర్ మాట్లాడుతూ, 25 ఏళ్ల క్రితం తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడటం ఆనందంగా ఉందన్నారు. ఇన్నేళ్ల తర్వాత కూడా పాఠశాల, గురువులు, స్నేహితులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గురువుల ఆశీస్సులు, పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలు జీవితాంతం విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. గురువుల సత్కారం, స్నేహితుల ఆత్మీయ కలయికతో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్‌రెడ్డి, వేణుగోపాల్, శేఖర్, సురేష్, భూమేశ్వర్, రవీందర్ రావు, భూమయ్యతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## మస్క్‌కు 57 లక్షల కోట్ల లాస్

**నెల రోజుల్లోనే భారీ క్షీణత**

న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపద కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారీగా పడిపోయింది. ఆయన నికర విలువలో సుమారు 600 బిలియన్ డాలర్లకు (రూ.57 లక్షల కోట్లు) పైగా కోత పడింది. స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల షేర్లు మార్కెట్లో తీవ్ర ఒత్తిడికి గురవడమే ఈ నష్టానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. అయినప్పటికీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అటానమస్ డ్రైవింగ్, రోబోటిక్స్ వంటి భవిష్యత్ టెక్నాలజీలపై తన పెట్టుబడుల ప్రణాళికలో మాత్రం మస్క్ వెనక్కి తగ్గడం లేదు. వివరాల్లోకి వెళ్తే, జూన్ 16న మస్క్ నికర విలువ సుమారు 1.33 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో స్పేస్‌ఎక్స్ షేర్ల దూకుడుతో ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. అయితే, నెల రోజులు గడిచేసరికి ఆయన సంపద 684 బిలియన్ డాలర్లకు పడిపోయింది. కేవలం మస్క్ సంపదలో వచ్చిన ఈ తగ్గుదల, ప్రపంచంలోని ఇతర బిలియనీర్ల మొత్తం సంపద కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ నష్టానికి స్పేస్‌ఎక్స్ షేర్ల పతనమే కీలక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## ముంపులోనే లంక గ్రామాలు


వైజాగ్, ఆగస్టు 2 (ఈవార్తలు): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.




VANGS
GLOBAL TECHNOLOGIES LLP
15 Days Free Trial
Launch Your Own Digital Newspaper Today
Complete ePaper & News Portal Solution
Dashboard
The Daily News
Global Economy Shows Strong Growth in 2024
City Marathon Sets New Record
BREAKING NEWS
CLOUD HOSTING
BREAKING NEWS • BREAKING NEWS •
ePaper Only Pricing
Starter
ePaper Only
10 GB Storage
₹17,999 / Year
★ Most Popular
Professional
ePaper Only
20 GB Storage
₹19,999 / Year
Enterprise
ePaper Only
30 GB Storage
₹21,999 / Year
News Module Add-on: +₹6,000 Extra
Includes full News Portal with all features
Powerful Features
Unlimited News
Unlimited Gallery
Unlimited Web Stories
Unlimited Traffic
SEO Ready
Custom Domain
Push Notifications
Single Click PDF Upload
ePaper Publishing
Breaking News
Live Updates
Custom Menu
Custom Theme
ID Card Designer
Employee News App
Category Management
Heat Track for News Reports & Admin
Multiple Language Support — Yes for All Platforms
ePaper Only Starting from
₹1,799 /month*
Book Free Demo
Start Your 15 Days Free Trial Today
https://vangstechnologies.com
hr@vangstechnologies.com
+91 7675087378

## యువత ఆశలకు రక్షణ..

# పేపర్ లీకేజీ చట్టం!



**భారతీయ సాంస్కృతిక విశిష్టతలో విద్యకు అత్యున్నత పీఠం ఉంది. "విద్యా ధనం సర్వధన ప్రధానమ్" అని ప్రాచీన సంస్కృత నానుడి చాటి చెప్పినట్లుగానే, విజ్ఞానం మానవాళికి వికాసాన్ని అందించే అమూల్యమైన సంపద. వేమన యోగి తన పద్యంలో "నిజమునకు నిలువ గలవాడే నరుడగు" అని వచించిన రీతిలో, సత్యం, నిష్పాక్షికత, నిజాయితీల పైనే ఏ సమాజమైనా, ఏ వ్యవస్థయినా నిలబడ గలుగుతుంది.**

**ముఖ్యంగా, నిరుద్యోగ రహిత సమాజ నిర్మాణంలోనూ, యువత ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించడం లోనూ పబ్లిక్ పరీక్షలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోనూ, కేంద్ర స్థాయిలోనూ చోటుచేసుకున్న ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలు, సామూహిక కాపీయింగ్, సాంకేతిక దుర్వినియోగ సంస్కృతి మన విద్యావ్యవస్థ మూలాలనే కంపింపజేశాయి.**

ప్రతిభావంతులైన లక్షలాది మంది నిరుద్యోగ యువత రక్తాన్ని చెమటగా మార్చి రాత్రింబవళ్లు చదివిన శ్రమను, వారి కుటుంబాల ఆశలను ఈ అక్రమ ముఠాలు ఒక్క క్షణంలో బూడిదలో పోసిన పన్నీరుగా మార్చి వేశాయి. ఈ కలుషిత వాతావరణాన్ని ప్రక్షాళన చేస్తూ, పరీక్షా విధానంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనను పునఃప్రతిష్ఠించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) చట్టం-2024' పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొంది, రాష్ట్రపతి ముద్రతో అమల్లోకి రావడం దేశ విద్యా చరిత్రలోనే ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. గత కొన్ని సంవత్సరాల పూర్వాపరాలను పరిశీలిస్తే, ప్రశ్నపత్రాల చోరీ, లీకేజీలు కేవలం స్థానిక పరిధికి మాత్రమే పరిమితం కాకుండా వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందడం అత్యంత శోచనీయం. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్-యుజి, పరిశోధక అభ్యర్థుల యుజిసి-నెట్ పరీక్షల రద్దుతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు, పోలీస్ నియామకాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు (తెలంగాణ టీఎస్‌పీఎస్సీ, రాజస్థాన్ ఆర్ఈఈటీ, మధ్యప్రదేశ్ వ్యాపం) నిర్వహించిన అనేక పోటీ పరీక్షలు లీకేజీ భూతానికి బలయ్యాయి. ఈ రద్దుల కారణంగా గత ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 1.5 కోట్లకు పైగా అభ్యర్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడింది. ఒక పరీక్ష రద్దయితే, అది కేవలం ప్రకటన నిలిచి పోవడం మాత్రమే కాదు; పరీక్ష అలవెన్సులు, శిక్షణ ఖర్చులు, లాడ్జింగ్, ప్రయాణ వ్యయాల రూపంలో అభ్యర్థుల కుటుంబాలపై కోట్లాది రూపాయల ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వ ఖజానాపై పునర్నిర్వహణ వ్యయం కత్తిలా వేలాడుతుంది. అంతకంటే మిన్నగా, అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి, నైరాశ్యానికి గురై తమ అమూల్యమైన జీవితకాలాన్ని నష్టపోతున్నారు. "న్యాయం ఆలస్యమైతే అది నిరాకరించ బడినట్లే" అనే నానుడిలా, పరీక్షలు నిరంతరం వాయిదా పడడం వల్ల యువత ఉత్పత్తి సామర్థ్యం వృథాగా పోతోంది.

ఈ దారుణ పరిస్థితుల నేపథ్యాన్నే కొత్త చట్టం తీవ్రంగా పరిగణించింది. ఈ నూతన చట్టం ప్రకారం, ప్రశ్నపత్రాల చోరీ, లీకేజీ, కొనుగోలు, విక్రయం, సామూహిక కాపీయింగ్, ఎలక్ట్రానిక్ ఆధారిత మోసాలు నాన్-బెయిలబుల్ (జామీను ఇవ్వడానికి వీలులేని) తీవ్ర నేరాలుగా వర్గీకరించ బడ్డాయి. సాధారణ అక్రమాలకు పాల్పడే వ్యక్తిగత నేరస్థులకు 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. ఇక వ్యవస్థీకృత నేర ముఠాలు, లీకేజీలకు ఒడిగట్టే సంస్థలు లేదా కోచింగ్ సెంటర్లకు 5 నుంచి 10 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్షతో పాటు ఏకంగా రూ. 1 కోటి వరకు భారీ జరిమానాలు విధిస్తారు. అక్రమాల ద్వారా సంపాదించిన అక్రమాస్తులను జప్తు చేసే అధికారాన్ని విచారణ సంస్థలకు కల్పించడం ద్వారా నేరస్థుల గుండెల్లో భయం కలిగించేలా చట్టాన్ని కట్టుదిట్టం చేశారు. ఈ చట్టం పరిధిలోకి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు, ఐబీపీఎస్ వంటి ప్రధాన కేంద్ర పరీక్షా నిర్వహణ సంస్థలన్నీ వస్తాయి. చట్ట అమలుతో పాటు పరీక్షా నిర్వహణలో బహుళస్థాయి భద్రతా వ్యవస్థ ప్రాధాన్యం సంతరించు కోనుంది. ప్రశ్నాపత్రాల ముద్రణ దశ నుండి పంపిణీ వరకు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ సర్వైలెన్స్, బయోమెట్రిక్ ప్రామాణీకరణ, సురక్షిత డిజిటల్ వాల్ట్‌ల వినియోగం తప్పనిసరి కానున్నాయి. ఇది కేవలం కేంద్ర పరీక్షలకే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా తమ స్వంత చట్టాలను మరింత కఠినతరం చేసుకోవడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. అయితే, సమాజంలో చట్టాలు రూపుదిద్దుకోవడం ఒకెత్తయితే, వాటిని క్షేత్రస్థాయిలో అక్షరాలా అమలు చేయడం మరొకెత్తు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం కఠిన శిక్షల చట్టాలు మాత్రమే సమాజంలోని కుళ్ళిన వ్యవస్థను రాత్రికి రాత్రే మార్చలేవు. ఈ చట్టానికి తోడుగా ప్రత్యేక వేగవంతమైన న్యాయస్థానాల ఏర్పాటు, సుశిక్షిత స్వతంత్ర దర్యాప్తు బృందాల పర్యవేక్షణ, విచారణలో కాలయాపన లేకపోవడం అత్యంత ప్రాధాన్యం. పరీక్షా నిర్వహణ సంస్థల్లో నైతిక పరిపాలన, అంతర్గత ఆడిటింగ్, ఉద్యోగుల జవాబుదారీతనం పెంపొందించడం ద్వారా మాత్రమే నమ్మకాన్ని పునరుద్ధరించ గలము. "మొక్కై వంగనిది మానై వంగునా" అనే సామెత చందంగా, నైతిక విలువలతో కూడిన విద్యా సంస్కృతిని, అక్రమ మార్గాల పట్ల అసహ్యభావాన్ని అభ్యర్థుల్లో కూడా పెంపొందించాలి.

భారతదేశ భాగ్యరేఖలు తరగతి గదుల్లోనూ, పరీక్షా హాళ్లలోనే తీర్చిదిద్ద బడతాయి. కోట్లాది మంది యువత ఆశలకు, ప్రతిభకు ఏ ఒక్క అక్రమార్కుడి స్వార్థం గ్రహణం పట్టకూడదు. "కష్టపడిన వానికి కడుపు నిండును" అన్న చందాన, శ్రమించిన అభ్యర్థికే విజయం దక్కాలనే సార్వత్రిక న్యాయ సూత్రానికి ఈ చట్టం భరోసా ఇస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, ఆధునిక సాంకేతిక భద్రత, పారదర్శక పరిపాలన, చట్టం యొక్క నిర్దాక్షిణ్య అమలు సమగ్రంగా మేళవించినప్పుడే ప్రశ్నపత్రాల లీకేజీ మహమ్మారి దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టుకు పోతుంది. అప్పుడే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిభకు తగిన గౌరవం దక్కి, దేశ విద్యా విధానం సుదృఢమైన, విశ్వసనీయమైన పునాదులపై విరాజిల్లుతుంది.



- రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, 9440595494

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పటికీ, సైబర్ నేరగాళ్లు, కోచింగ్ మాఫియా, మధ్యవర్తులు, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బంది పరస్పరం కుమ్మక్కై సృష్టిస్తున్న అక్రమాలు పరీక్షల భద్రతను సవాలు చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఇయర్ పీస్‌లు, బ్లూటూత్ డివైజ్‌లు, డమ్మీ అభ్యర్థులను కూర్చోబెట్టడం, డిజిటల్ మాధ్యమాల ద్వారా లీకైన పేపర్లను సెకన్ల వ్యవధిలో పంపిణీ చేయడం వంటి కుట్రలు వ్యవస్థీకృతంగా సాగుతున్నాయి.**

---



## ఎల్లంపల్లి నిండింది..

# బీఆర్ఎస్ అబద్ధాల ఆనకట్ట బద్ధలైంది!

**రాజకీయాల్లో విమర్శించడం ప్రతిపక్షం హక్కు. కానీ ప్రజలను తప్పుదోవ పట్టించే దుష్ప్రచారం చేయడం మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. గత కొన్ని రోజులుగా గోదావరిలో ప్రవహిస్తున్న నీటిని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ సాగించిన ప్రచారం చూస్తే, తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే వారికి ముఖ్యమనే భావన కలుగుతోంది. "గోదావరి నీటిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వృథాగా వదిలేస్తోంది", "కన్నెపల్లి పంపులు ఆన్ చేయకపోవడం తెలంగాణ రైతాంగంపై ద్రోహం", "ఇది చారిత్రక కుట్ర" అంటూ బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు.**

**కానీ నేడు ప్రకృతే వారి ప్రచారానికి సమాధానం చెప్పింది. కన్నెపల్లి పంపులను వెంటనే నడపాలంటూ చేసిన ప్రచారం వెనుక రాజకీయ ఉద్దేశం ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) హెచ్చరికలు ఉన్నాయని తెలిసినా, వాటిని పక్కనపెట్టి నీటిని నిల్వ చేయాలని ఒత్తిడి తేవడం బాధ్యతాయుతమైన రాజకీయం కాదు. ఒకవేళ అలాంటి పరిస్థితిలో ఏదైనా ప్రమాదం జరిగి ఉంటే, ప్రభుత్వంపై నిందలు మోపడానికి ప్రయత్నించే అవకాశం ఉండేదనే అనుమానం సహజమే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం నినాదాలను కాదు... నిపుణుల సూచనలను గౌరవించింది. అదే బాధ్యతాయుతమైన ప్రజా పాలన.**

- వెలిచాల రాజేందర్ రావు
సీనియర్ కాంగ్రెస్ నాయకుడు
9849061481

ఈ మొత్తం చర్చకు సమాధానం చెప్పింది ప్రకృతే. గురువారం రాత్రి 8 గంటలకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 3,56,254 క్యూసెక్కుల భారీ వరద ప్రవాహం నమోదైంది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 1,56,279 క్యూసెక్కులు, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి 1,99,975 క్యూసెక్కులు వచ్చాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఒక్క క్యూసెక్కు నీరు రాకపోయినా ఎల్లంపల్లి పూర్తిస్థాయికి చేరువైంది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా 15 గేట్లు ఎత్తి సుమారు 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయాల్సి వచ్చింది. ఈ గణాంకాలు కేవలం వరద లెక్కలు కావు. ఇవి ఒక రాజకీయ ప్రచారాన్ని ప్రశ్నిస్తున్న వాస్తవాలు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఒక్క చుక్క నీటిని కూడా ఎత్తిపోకుండానే ఎల్లంపల్లి నిండింది. మరి "మేడిగడ్డలో నీటిని నిల్వ చేసి, కన్నెపల్లి-అన్నారం-సుందిళ్ల మీదుగా మూడు దశల్లో ఎత్తిపోస్తేనే ఎల్లంపల్లి నిండుతుంది" అని ఏళ్ల తరబడి చేసిన ప్రచారం ఏమైంది?.. ఉత్త ప్రచారమని తెలిసిపోయింది. అంటే బిఆర్ఎస్ నేతలు రైతులను రెచ్చగొట్టడం రాజకీయంగా ప్రభుత్వంపై బురద జల్లడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ప్రభుత్వం చేస్తున్న మంచిని చూడకపోవడం అలవాటుగా మారింది.

మేడిగడ్డ నుంచి సుమారు 47.2 కిలోమీటర్ల దూరంలో అన్నారం, 80.7 కిలోమీటర్ల వద్ద సుందిళ్ల, 111.1 కిలోమీటర్ల వద్ద ఎల్లంపల్లి ఉన్నాయి. ఈ మూడు దశల పంపింగ్ ద్వారానే ఉత్తర తెలంగాణకు నీరు అందుతుందని గత ప్రభుత్వం పదేపదే ప్రచారం చేసింది. కానీ తాజా వరద పరిస్థితులు మరో వాస్తవాన్ని చెబుతున్నాయి. ఎల్లంపల్లి కేవలం రివర్స్ పంపింగ్‌పై ఆధారపడిన ప్రాజెక్టు కాదు. ఎగువ గోదావరి, కడెం నది, విస్తారమైన స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి వచ్చే సహజ ప్రవాహాలే దీనికి ప్రధాన బలం. ఈసారి వచ్చిన వరద అదే విషయాన్ని మరోసారి నిరూపించింది. నదిలో నీరు కనిపించడం ఒక విషయం. పంపులు నడిపేందుకు అవసరమైన కనీస నీటిమట్టం ఉండటం మరో విషయం.

**ఎల్లంపల్లి నిండింది... నిండింది కేవలం ఒక జలాశయం కాదు..**
**బీఆర్ఎస్ దుష్ప్రచారానికి ప్రజల ముందు సమాధానం చెప్పిన వాస్తవాల జలాశయం.**
**అబద్ధాలతో ఆనకట్టలు కట్టవచ్చు.. కానీ వాస్తవాల వరద వస్తే అవి నిలవవు.**
**"ఎల్లంపల్లి నిండింది... బీఆర్ఎస్ అబద్ధాల ఆనకట్ట బద్ధలైంది!"**

మేడిగడ్డ వద్ద పంపింగ్ ప్రారంభించాలంటే కనీసం o93.50 మీటర్లు, అన్నారం వద్ద 116.50 మీటర్లు, సుందిళ్ల వద్ద 126.50 మీటర్ల నీటిమట్టం అవసరం. ఈ సాంకేతిక అంశాన్ని తెలిసీ తెలియనట్టుగా బీఆర్ఎస్ వ్యవహరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. అంతేకాదు... మేడిగడ్డ బ్యారేజీ భద్రతపై ఎన్‌డీఎస్ఏ చేసిన సూచనలను విస్మరించి నీటిని నిల్వ చేయడం ఎంత ప్రమాదకరమో నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. వారి సూచనల మేరకు అలాంటి సమయంలో ప్రభుత్వం భద్రతకు ప్రాధాన్యం ఇచ్చింది.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజలు ప్రశ్నలు అడుగుతున్న సమయంలో, వాటికి బీఆర్ఎస్ సమాధానాలు చెప్పాల్సింది పోయి కొత్త దుష్ప్రచారానికి తెరలేపడం విచారకరం. కాళేశ్వరం పూర్తిస్థాయిలో పనిచేయని గత రెండున్నరేళ్లలో కూడా తెలంగాణ రైతాంగం రికార్డు స్థాయిలో పంటలు పండించింది. ఇది రైతు శ్రమకు, ప్రకృతి సహకారానికి, ప్రభుత్వం తీసుకున్న చర్యలు. ప్రత్యామ్నాయ నీటిపారుదల వనరులకు నిదర్శనం. ప్రస్తుతం ప్రభుత్వం నంది, గాయత్రి, దేవాదుల పంపుల ద్వారా అవసరమైన ప్రాంతాలకు గోదావరి జలాలను సమర్థవంతంగా ఎత్తిపోస్తోంది. అంటే రైతు అవసరాలను విస్మరించకుండా, భద్రతను కాపాడుతూ ప్రత్యామ్నాయ మార్గాల్లో పనిచేస్తోంది. ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండాలి. కానీ అవి వాస్తవాలపై నిలబడాలి. ప్రచారం కోసం వాస్తవాలను వక్రీకరించడం, భయాలను రెచ్చగొట్టడం, ప్రతి అంశాన్ని రాజకీయ లాభనష్టాల కోణంలో చూడడం ప్రజలకు మేలు చేయదు.

వయ్యారి చిత్రం






## డాటే లేదు..
# డిసెంబర్ 3నే ఫౌజీ: మైత్రి

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. కొంతకాలం క్రితమే ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఈ సినిమాకు సంబంధించిన పెద్దగా ఎలాంటి అప్డేట్లు బయటకు రాలేదు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా 'కేజేక్యూ' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు హాజరైన ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్‌ను యాంకర్ 'ఫౌజీ' సినిమా గురించి ఏమైనా అప్డేట్ ఇవ్వాలని ప్రశ్నించారు. దీనికి స్పందించిన రవిశంకర్, "ముందుగా ప్రకటించినట్లుగానే డిసెంబర్ 3న 'ఫౌజీ' సినిమాను విడుదల చేస్తాం. అంతేకాదు, విడుదలకు ఒక రోజు ముందు అంటే డిసెంబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ప్రీమియర్స్ కూడా వేస్తాం" అని స్పష్టం చేశారు. నిర్మాత విడుదల తేదీపై పూర్తి విశ్వాసంతో ఈ ప్రకటన చేయడంతో ప్రభాస్ అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఈ సినిమా ఎలాంటి వాయిదాలు లేకుండా డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు వస్తుందని వారు గట్టి నమ్మకంతో ఉన్నారు. అలాగే, 'ఫౌజీ' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తుందనే ఆశాభావాన్ని కూడా అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా, హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

# 'ఎల్లమ్మ' పోస్టర్ రిలీజ్

ప్రముఖ సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ అందింది. ఆయన కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతున్న 'ఎల్లమ్మ' చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో దేవి శ్రీ





ప్రసాద్ 'పర్షి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలైన పోస్టర్‌లో దేవి శ్రీ ప్రసాద్ రెట్రో రగ్డ్ లుక్‌లో, పల్లెటూరి యువకుడిగా ఎంతో సహజంగా కనిపిస్తున్నారు. ఆయన పాత్ర పేరు 'పర్షి' అని ప్రకటిస్తూ, "మీరు గుర్తుంచుకునే పేరు, మీరు ఎప్పటికీ మరచిపోలేని ప్రయాణం" అనే క్యాప్షన్‌ను జోడించారు. దీన్నిబట్టి ఈ సినిమా మట్టితో ముడిపడిన ఒక బలమైన కథతో రాబోతోందని అర్థమవుతోంది. 'బలగం' వంటి జాతీయ అవార్డు పొందిన చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు తారాస్థాయికి చేరాయి.

## చిరు, నాగ్‌తో అనిల్ రావిపూడి మల్టీస్టారర్



దర్శకుడు అనిల్ రావిపూడి టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జునలతో క్రేజీ సినిమా తెరకెక్కించబోతున్నాడట. ఇలా ఇద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే అభిమానులకు అది నిజంగా పండగ అనే చెప్పొచ్చు. అంతేకాదు.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## జీరో సైజ్ ఉంటేనే హీరోయిన్లా?



"రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ" చిత్రంతో గుర్తింపు పొందిన నటి అంజలి ఆనంద్.. బాలీవుడ్‌లో నటీమణులు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై గళమెత్తారు. ప్రస్తుతం ధమాల్ 4 సినిమాలో నటించిన ఆమె చిత్ర పరిశ్రమలో అందానికి ఉన్న సంకుచిత నిర్వచనాలను సూటిగా నిలదీశారు. "బాలీవుడ్‌లో గ్లామర్ అంటే కేవలం 'జీరో సైజ్' శరీరాకృతి మాత్రమేనా? ఒక నటి ప్రతిభను కాకుండా, ఆమె రూపాన్ని బట్టి భవిష్యత్తును ఎందుకు అంచనా వేస్తున్నారు?" అని అంజలి ప్రశ్నించారు. తన నటన, కష్టం కంటే తన బరువు గురించే సమాజం ఎక్కువగా చర్చించడం బాధాకరమని, అయితే అటువంటి విమర్శలకు కుంగిపోకుండా తన ప్రతిభతోనే సమాధానం చెబుతానని ఆమె స్పష్టం చేశారు. తన పోరాటం కేవలం తన కోసమే కాదని, ఇటువంటి వివక్షను ఎదుర్కొంటున్న ప్రతి అమ్మాయి కోసమని ఆమె పేర్కొన్నారు. సంప్రదాయ కథానాయికల రూపానికి భిన్నంగా ఉండే నటీమణులకు బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో పాత్రలు లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటీమణుల బాహ్య రూపాన్ని కాకుండా, వారి నైపుణ్యాలను, భావోద్వేగాలను వాడుకునేలా రచయితలు, దర్శకులు పాత్రలను సృష్టించాలని ఆమె కోరారు. 'ధమాల్ 4'లో తన పాత్ర, తాను వ్యక్తిగతంగా వ్యతిరేకించే అంశానికి సంబంధించి ఉండటంతో, దానిని అంగీకరించే ముందు కొంత మానసిక సంఘర్షణకు లోనైనట్లు ఆమె వెల్లడించారు.

## విన్సెంట్ పాస్టోర్ అనుమానాస్పద మృతి

'ది సోప్రానోస్' సిరీస్‌తో ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ప్రముఖ హాలీవుడ్ నటుడు విన్సెంట్ పాస్టోర్ (80) కన్నుమూశారు. న్యూయార్క్‌లోని తన నివాసంలో ఆయన



మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. గత కొన్ని రోజులుగా ఆయన నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు, ఆయన నివాసానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం లభ్యమైంది. మరణానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామని పోలీసులు వెల్లడించారు. క్రైమ్ డ్రామా సిరీస్ 'ది సోప్రానోస్'లో ఆయన పోషించిన సాల్వటోర్ 'బిగ్ పుస్సీ' బాన్‌పెన్‌సీరో పాత్ర విశేష ప్రజాదరణ పొందింది. గ్యాంగ్‌స్టర్, టఫ్-గై తరహా పాత్రలకు ఆయన పెట్టింది పేరు.

## రజనీకాంత్ కోసమే
# జైలర్-2లో నటించా

విజయ్ సేతుపతి తాజాగా తన కెరీర్‌కు సంబంధించి ఓ సంచలన నిర్ణయాన్ని వెల్లడించారు. గతంలో కేవలం కథలు నచ్చి, మంచి స్కోప్ ఉన్న అనేక సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు, గెస్ట్ రోల్స్ చేశానని విజయ్ సేతుపతి గుర్తు చేసుకున్నారు. అయితే ఇకపై సినిమాల్లో ఎలాంటి అతిథి పాత్రలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. అయితే రాబోయే 'జైలర్-2' సినిమా మాత్రమే దీనికి ఏకైక మినహాయింపు అని, అది కూడా కేవలం సూపర్‌స్టార్ రజినీకాంత్ కోసం మాత్రమే ఆ పాత్ర చేయడానికి అంగీకరించానని చెప్పారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాన్ని వివరిస్తూ.. "రజినీకాంత్‌తో కలిసి పనిచేసే అరుదైన అవకాశం వదులుకోకూడదనే ఉద్దేశంతోనే 'జైలర్-2'లో గెస్ట్ రోల్ చేశాను. ఒకవేళ రజినీ గారితో కలిసి నా ఫోటో ఉన్న పోస్టర్ వస్తే, ఎవరూ నన్ను ప్రత్యేకంగా గమనించరు.





## కాలేజీ గోడలపై నా పేరు రాసేవాడు

కాలేజీ రోజుల్లో తనకు ఎదురైన ఓ భయంకరమైన సంఘటన గురించి బుల్లితెర నటి శుభాంగి ఆత్రే తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఆమె ఇంటర్ చదవుతున్న రోజుల్లో ఓ వ్యక్తి రోజు బైక్‌పై ఫాలో అయ్యేవాడని.. అతని చర్యలు చూసి భయపడిపోయానని శుభాంగి చెప్పింది. 'నేను ఇండోర్‌లో 10-11వ తరగతి చదవుతున్నప్పుడు ఓ వ్యక్తి రోజు బైక్‌పై మమ్మల్ని ఫాలో అయ్యేవాడు. కాలేజీ గోడలపై, రోడ్డుపై నా పేరు, తన పేరు కలిపి రాసేశాడు. మా ఇంటికి ఎదురుగా ఉన్న గోడపై కూడా అలానే రాశాడు. నేను అతనితో ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కానీ మా వెనకే తిరిగేవాడు. ఓ సారి మా అక్క అతనితో మాట్లాడింది. 'ఇలా తిరడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని.. ఏదైనా సాధించి రా.. అప్పుడు మనం మాట్లాడుకుందాం'అని చెప్పింది. కొన్నాళ్ల తర్వాత అతను కనిపించకుండా పోయాడు. ఇలాంటి వేధింపులు ఆడపిల్లలను చాలా భయానికి గురి చేస్తాయి. బయటకు కూడా రాలేరు. ఇంట్లో వాళ్లు కూడా భయపడతారు. వేధింపులపై మహిళలు, యువతులు మౌనంగా ఉండకూడదు. ధైర్యంగా ఎదురు తిరగాలి. నేటి తరం అమ్మాయిలు తమ రక్షణ విషయంలో మరింత జాగ్రత్తతో వ్యవహరించడం మంచి పరిణామం' అని శుభాంగి అన్నారు.

## థియేటర్లలో మిస్సయినా జీ5లో మిస్‌కాకండి

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించి, బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'లెనిన్' చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'జీ5' (జుజు5) వేదికగా ఈ సినిమా ఆగస్టు 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. "కొడుతున్నాం కాదు.. కొట్టేశాం అంతే! థియేటర్లలో మిస్ అయితే.. జీ5లో అస్సలు మిస్ అవ్వకండి" అనే ట్యాగ్‌లైన్‌తో జీ5 ఈ



విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున విడుదల చేసిన ప్రత్యేక వీడియోను జీ5 తెలుగు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. "'లెనిన్' సినిమాను థియేటర్లలో ఆదరించి పెద్ద హిట్ చేసినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇప్పుడు మనోడు నేరుగా మీ ఇంటికి వచ్చేస్తున్నాడు. అక్కడ కూడా అలాగే ఆదరించండి, తప్పకుండా చూడండి" అంటూ నాగార్జున ఈ వీడియోలో విజ్ఞప్తి చేశారు. జులై 10న థియేటర్లలో విడుదలైన ఈ రూరల్ యాక్షన్ డ్రామా, అఖిల్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ. 100 కోట్ల గ్రాస్ కలెక్షన్లను అధిగమించినట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. థియేటర్లలో ఈ సినిమాను వీక్షించలేకపోయిన ప్రేక్షకుల కోసం విడుదలైన నెల రోజులు గడవకముందే ఓటీటీలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు.



# అభిషేక్ శర్మ ఊచకోత

## 15 ఫోర్లు, 25 సిక్సర్లు .. 91 బంతుల్లో 233 పరుగులు

టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తాజాగా ఓ వన్డే మ్యాచ్‌లో సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. అమృత్‌సర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ తరన్ తారన్ మెన్స్ సీనియర్ జట్టుపై 91 బంతుల్లో 233 పరుగులతో చెలరేగాడు. ఈ ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 25 సిక్సర్లు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే, అభిషేక్ ఇటీవలికాలంలో టీమిండియా తరఫున వరుసగా విఫలమయ్యాడు. గత ఏడు టీ20 మ్యాచ్‌ల్లో అతడు ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. చివరిగా ఇంగ్లండ్ పర్యటనలో తొలి మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేశాడు. దానికి ముందు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శనలేమీ చేయలేదు. అతడు చివరి సారిగా మూడంకెల స్కోర్ చేసింది ఐపీఎల్ 2026లో. డీసీతో జరిగిన మ్యాచ్‌లో అతడు 68 బంతుల్లో అజేయమైన 135 పరుగులు చేశాడు. తాజాగా జింబాబ్వేతో ముగిసిన 3 మ్యాచ్‌ల సిరీస్‌లో అభిషేక్ ఫామ్ ఘోరంగా పడిపోయింది. ఆ మూడు మ్యాచ్‌ల్లో అతడు వరుసగా 1, 8, 2 స్కోర్లు చేశాడు. ఈ సిరీస్‌లో అభిషేక్ కనీసం రెండంకెల స్కోర్‌ను కూడా చేయలేకపోయాడు. ప్రస్తుతం భారత జట్టు ఖాళీగా ఉండటంతో స్థానిక వన్డే మ్యాచ్ ఆడిన అభిషేక్ ఎట్టకేలకు ఫామ్ దొరకబుచ్చుకున్నాడు. త్వరలో టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుండగా, ఆ పర్యటన నిమిత్తం ఎంపిక చేసిన టెస్ట్ జట్టులో అభిషేక్‌కు చోటు దక్కలేదు. అభిషేక్‌కు గతకొంతకాలంగా టీ20ల్లో మాత్రమే అవకాశం వస్తుంది. తాజా ప్రదర్శనతో అతడు వన్డే జట్టులో స్థానంపై కూడా కన్నేయవచ్చు. టీమిండియా రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ నిమిత్తం ఆగస్ట్ 4న శ్రీలంక పర్యటనకు బయల్దేరనుంది. ఈ సిరీస్‌లోని తొలి టెస్ట్ మ్యాచ్ గాలే వేదికగా ఆగస్ట్ 15న ప్రారంభం కానుంది. దీనికి ముందు భారత జట్టు ఓ వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

# ఆసియా కప్‌కు మహిళల జట్టు ప్రకటన




మహిళల ఆసియా కప్ 2026 కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్సీపై ఇటీవల చర్చ జరిగినప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్‌నే కెప్టెన్‌గా కొనసాగించింది. స్మృతి మంధానను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. జట్టులో స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ వంటి కీలక ప్లేయర్లకు చోటు దక్కింది. టీ20 ప్రపంచకప్ జట్టులో ఉన్న శ్రేయాంక పాటిల్‌కు ఆసియా కప్ జట్టులో చోటు దక్కలేదు. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఆమె కుడి చీలమండకు గాయమయ్యింది. శ్రేయాంక స్థానంలో టీ20 ప్రపంచకప్ జట్టులోకి వచ్చిన ప్రేమా రావత్ ఆసియా కప్ జట్టులోనూ కొనసాగింది. కాగా, ఆసియా కప్ 2026 సెప్టెంబర్ 17న మొదలై 22వ తేదీ వరకు జరుగనుంది. ఈ టోర్నీ ఫిక్చర్స్ ఇంకా ఖరారు కాలేదు.

**భారత మహిళల ఆసియా కప్ 2026 జట్టు**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమిలిని, అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్.

# ఆటపై ఇష్టంతోనే ఆడుతున్నా: భువీ

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్, భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావాలన్నదే ఇప్పుడు తన ప్రధాన లక్ష్యం కాదని, కేవలం ఆటపై ఉన్న ప్రేమతోనే క్రికెట్ కొనసాగిస్తున్నానని స్పష్టం చేశాడు. భారత జట్టుకు దూరమైన జీవితంతో తాను సంతృప్తిగా ఉన్నానని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటను ఆస్వాదిస్తున్నానని తెలిపాడు. 36 ఏళ్ల భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకు 21 టెస్టులు, 121 వన్డేలు, 87 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఆర్‌సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "దేశం తరఫున ఆడాలన్న నా కల ఇప్పటికే నెరవేరింది. ఇప్పుడు మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్ప విషయమే. కానీ, దానికోసం ఒత్తిడికి గురికావడం లేదు. ప్రస్తుతం నేను ఆడుతున్నది కేవలం ఆటపై ఉన్న ఇష్టం, క్రమశిక్షణతోనే" అని వివరించాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, యూపీ టీ20 లీగ్‌లలో ఆడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నట్లు తెలిపాడు.



# చివరి రోజు సున్నా

## భారత్‌కు 39 పతకాలే



**కామన్వెల్త్ క్రీడల్లో చివరి రోజు భారత అథ్లెట్లు నిరాశపరిచారు. జుడోలో ఆశలు రేపిన ఇష్రూప్ నారంగ్, పారా సైక్లిస్ట్ లిషా దాస్‌లు విఫలమవ్వగా, ఒక్క పతకం రాలేదు. దాంతో, ఈసారైనా నలభైకి పైగా మెడల్స్ సాధించాలనుకున్న భారత బృందం కల నిజమవ్వలేదు. పదోరోజు బాక్సర్లు ఏడు స్వర్ణాలు, రెండు రజతాలు.. జుడోలో ఉన్నాటి శర్మ గెలిచిన కాంస్యంతోనే టోర్నీని ముగించింది టీమిండియా. 126 మంది బృందంతో వెళ్లినప్పటికీ.. చివరకు 39 పతకాలతో సగర్వంగానే స్వదేశానికి రానుంది.**

గ్లాస్గో ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ గేమ్స్‌లో ఆఖరిరోజు మరిన్ని పతకాలు వస్తాయనుకుంటే నిరాశే మిగిలింది. పదోరోజు గెలిచిన మెడల్స్‌తోనే సరిపెట్టుకున్న టీమిండియా.. 39 పతకాలతో తిరిగి స్వదేశం రానుంది. బాక్సర్లు, వెయిట్‌లిఫ్టర్ల పుణ్యమాని 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు వచ్చాయి. ఆశించిన స్థాయిలో మెడల్స్ రాకున్నా ఈసారి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది భారత్. 57 కిలోల బాక్సింగ్‌లో పసిడి కొల్లగొట్టిన జాస్మినే లంబోరియా ముగింపు వేడుకల్లో భారత జాతీయ పతాకాన్ని చేబూని ముందు నడువనుంది.

**భారత పతక విజేతలు:**

స్వర్ణం : మీరాబాయి చాను(వెయిట్‌లిఫ్టర్, 48 కిలోలు), ప్రీతి పవార్(బాక్సర్, 54 కిలోలు), జాస్మినే లంబోరియా(బాక్సర్, 57 కిలోలు), సాక్షి చౌదరి(బాక్సర్, 51 కిలోలు), ప్రియా ఘంఘాస్(బాక్సర్, మహిళల 60 కిలోలు), సచిన్ సివాగె(బాక్సర్, 60 కిలోలు) అస్మితా దే(జుడో), హర్ష్ సింగ్(జుడో), సోమన్ రానా(పారా షాట్‌పుట్), షర్మిలా ధన్కర్(పారా షాట్‌పుట్), దిలిప్ గవిట్(పారా అథ్లెటిక్స్). అరుంధతి చౌదరీ(బాక్సర్ 70 కిలోలు), అంకుశ్ పంగాల్(బాక్సర్, 80 కిలోలు)

రజతం: నీరజ్ చోప్రా(జావెలిన్ త్రో), జుడుమని సింగ్(బాక్సింగ్, 55 కిలోలు), మొహమ్మద్ బసిల్(పారా అథ్లెటిక్స్), సర్వేశ్ కుషారే(హై జంప్), గుల్వీర్ సింగ్(మారథాన్ పరుగు), ప్రవీణ్ చిత్రవేల్(ట్రిపుల్ జంప్), నరేంద్ర బెర్వాల్(బాక్సర్, 90ప్లస్ కిలోలు), లొవ్లీనా బొర్గొహైన్(బాక్సర్, 75 కిలోలు) శుభమ్ జులియా(పారా షాట్‌పుట్),

కాంస్యం: గుల్వీర్ సింగ్(అథ్లెటిక్స్), యశ్వీర్ సింగ్(జావెలిన్ త్రో), సిల్వా శ్యాల(పారా అథ్లెట్) లవ్లీనా బొర్గొహైన్( బాక్సర్, 75 కిలోలు), ఉన్నాటి శర్మ(జుడో), సెల్వ ప్రభు తిరుమరన్(ట్రిపుల్ జంప్), తేజస్విన్ శంకర్(డెకథ్లాన్)




# శ్రీలంక పర్యటనకు బుమ్రా దూరం




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో కీలకమైన పర్యనటకు ముందే భారత జట్టుకు బిగ్ షాక్. శ్రీలంక పర్యటనకు ఎంపికైన జస్ప్రీత్ బుమ్రా టెస్టు సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఫిట్‌నెస్ టెస్టులో పాసైన బుమ్రా.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడమే అందుకు కారణం. దాంతో, లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు యార్కర్ కింగ్ అందుబాటులో ఉండడని ఆదివారం భారత క్రికెట్ నియంత్రణ మండలి వెల్లడించింది. శ్రీలంక పర్యటనకు స్క్వాడ్‌తో కలుస్తాడనుకున్న జస్ప్రీత్ బుమ్రా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు రోజుల క్రితమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ సాధించిన అతడు.. మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. కాబట్టి.. లంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికైన బుమ్రాను స్క్వాడ్ నుంచి తప్పించనుంది బీసీసీఐ. ఇంగ్లండ్ పర్యటనలో రెండో వన్డేలో గాయపడిన యార్కర్ కింగ్.. అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు ఆడలేదు. సీఓఈలో ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన అతడు.. శ్రీలంక పర్యటనకు సిద్ధంగా ఉంటాడని బీసీసీఐ ఆశించింది. కానీ, అతడు వంద శాతం కోలుకోలేదు. దాంతో.. బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ దళానికి అనుభవజ్ఞుడైన సిరాజ్ నాయకత్వం వహించనున్నాడు. అయితే.. బుమ్రా స్థానంలో మరొకరిని ఇంకా స్క్వాడ్‌లోకి తీసుకోలేదు.

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రిషభ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సరాన్ష్ జైన్.

# సౌత్ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ

దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ కోసం సౌత్ జోన్ తమ జట్టును ప్రకటించింది. భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్, హైదరాబాద్ యువ సంచలనం తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర జట్టుకు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. నేడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీశ్ బాబు నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్ర మాజీ రంజీ ఆటగాడు ఆర్వీ చంద్రమౌళి ప్రసాద్ ఈ సెలక్షన్ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సౌత్ జోన్‌లోని ఏడు సభ్య సంఘాలైన ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, గోవా, పాండిచ్చేరి, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్టుకు హెడ్ కోచ్‌గా ఆంధ్రకు చెందిన అనుభవజ్ఞుడైన లెవల్ 2 కోచ్ ఎంఎన్ విక్రమ్ వర్మను నియమించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో యువత, అనుభవం చక్కగా మేళవించారు. భారత జట్టుకు ఆడిన వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కింది. 2025/26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 950 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన కర్ణాటక యువ ఆటగాడు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఇటీవలే జింబాబ్వేపై 3–0తో టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులో తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు.



ఎన్. తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె.ఎం. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), కరుణ్ నాయర్, తనయ్ త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయితేజ, టి. విజయ్, విద్వత్ కావరప్ప, హెచ్. అమన్ ఖాన్, ఎం.డి. నిదీశ్.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# కాళేశ్వరం ఎప్పటికీ సజీవమే!

ఒక ప్రాజెక్టును కేవలం రాజకీయ కళ్లజోడుతో చూడటం సులభం. కానీ దాని అవసరాన్ని, భవిష్యత్తులో రాష్ట్రానికి అందించే ప్రయోజనాలను అంచనా వేయడం మాత్రం బాధ్యతాయుతమైన దృక్పథం. తెలంగాణలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విషయంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ విమర్శలు, ఆరోపణలు ఎంత తీవ్రంగా ఉన్నా.. ఒక వాస్తవాన్ని మాత్రం ఎవరూ విస్మరించలేరు. అదే.. కాళేశ్వరం తెలంగాణకు ఇప్పటికీ అవసరమే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిర్మాణ లోపాలు ఉన్నాయా? వాటిపై విచారణ జరగాలా? తప్పకుండా జరగాలి. ప్రజాధనం ఖర్చు అయిన ప్రతి రూపాయికి జవాబుదారీతనం ఉండాలి. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ కొన్ని నిర్మాణ సమస్యలను చూపిస్తూ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టునే పనికిరాదని ప్రకటించడం వాస్తవాలను వక్రీకరించడమే అవుతుంది. తెలంగాణ భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే, రాష్ట్రంలోని చాలా ప్రాంతాలు ఎత్తైన భూభాగంలో ఉన్నాయి. సహజంగా గురుత్వాకర్షణ ద్వారా నీరు చేరే అవకాశం లేదు. అందుకే ఎత్తిపోతల పథకాలు తెలంగాణకు విలాసం కాదు, అవసరం. గోదావరి జలాలను పై ప్రాంతాలకు తరలించేందుకు కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టు తప్ప మరో ప్రత్యామ్నాయం ఇప్పటికీ కనిపించడం లేదు. కాళేశ్వరం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందింది. అనేక చెరువులు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పరిస్థితి మెరుగుపడింది. పరిశ్రమలకు కూడా నీటి సరఫరా సాధ్యమైంది. ఈ ప్రయోజనాలను ఒక్కసారిగా కొట్టిపారేయడం న్యాయం కాదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం కాళేశ్వరంపై తీవ్ర విమర్శలు చేస్తోంది. కానీ అదే సమయంలో ప్రత్యామ్నాయ జల ప్రణాళికను మాత్రం ప్రజల ముందుంచలేకపోతోంది. కాళేశ్వరాన్ని పూర్తిగా మూసివేస్తామా? లేక మరమ్మతులు చేసి వినియోగిస్తామా? అనే అంశంపై స్పష్టమైన విధానం ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే నీరు రాజకీయాల కోసం కాదు, ప్రజల జీవనాధారం కోసం. ప్రపంచవ్యాప్తంగా పెద్ద నీటిపారుదల ప్రాజెక్టుల్లో నిర్మాణ సమస్యలు ఎదురైన సందర్భాలు ఉన్నాయి. వాటిని సరిదిద్ది మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. ఒక లోపం వల్ల మొత్తం ప్రాజెక్టును శాశ్వతంగా పక్కన పెట్టడం అభివృద్ధి దృక్పథం కాదు. వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. వర్షపాతం అనిశ్చితంగా మారుతోంది. భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టుల ప్రాధాన్యం మరింత పెరగనుంది. అలాంటి సమయంలో కాళేశ్వరం వంటి మౌలిక సదుపాయాన్ని నిర్లక్ష్యం చేయడం తెలంగాణ భవిష్యత్తుపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రజాధనం వృథా కాకూడదంటే ఇప్పటికే నిర్మించిన మౌలిక వసతులను శాస్త్రీయంగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి, భద్రతా ప్రమాణాలను మెరుగుపరచి తిరిగి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి. ఇది రాజకీయ విజయం లేదా పరాజయం కాదు; ప్రజా ప్రయోజనం. కాళేశ్వరం కేవలం ఒక ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టు కాదు. అది తెలంగాణ రైతు ఆశలతో, రాష్ట్ర నీటి భద్రతతో ముడిపడిన వ్యవస్థ. ప్రభుత్వాలు మారవచ్చు. రాజకీయాలు మారవచ్చు. కానీ నీటి అవసరం మారదు. అందుకే కాళేశ్వరం గురించి తీసుకునే ప్రతి నిర్ణయం రాజకీయ కోణంలో కాకుండా శాస్త్రీయంగా, ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ఉండాలి. కాళేశ్వరంలో లోపాలు ఉంటే సరిచేయాలి. బాధ్యులను శిక్షించాలి. కానీ తెలంగాణకు అవసరమైన ఈ మహత్తర జలవనరుల వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం మాత్రం రాష్ట్ర భవిష్యత్తుకు మేలు చేయదు. అందుకే.. కాళేశ్వరం ఎప్పటికీ సజీవమే.

# బహుజన తెలంగాణకు బహుజన జెన్ జీ

**12 వందల** బహుజన బిడ్డల బలిదానంతో ఏర్పడిన తెలంగాణ బహుజనులకు దక్కలేదు. సామాజిక న్యాయతెలంగాణను సమాధి చేశారు, 13 సంవత్సరాల తెలంగాణ పాలనలో తెలంగాణ పునర్ నిర్మాణానికి పునాదే వేయబడలేదు, తెలంగాణ పునర్నిర్మాణం తెలంగాణ అసెంబ్లీ నుంచే ప్రారంభం కావాలి,తెలంగాణ అసెంబ్లీలో 70 మంది బహుజన్ జెన్ జెడ్ సభ్యుల ప్రవేశంతో తెలంగాణ పునర్ నిర్మాణం ప్రారంభం కావాలి. తెలంగాణ పునర్నిర్మాణం బహుజనుల పాలనతోనే ప్రారంభం కావాలి, అందుకే బహుజనులు తెలంగాణలో రిజర్వేషన్ల కోసం అడుక్కునే ఉద్యమాలకు స్వస్తి పలకాలి, ఆధిపత్య వర్గాల నాయకత్వ ఉద్యమాలకు, వారి భారీ బహిరంగ సభలకు ధర్నాలకు,దీక్షలకు, రస్తారోకోలకు,చలో అసెంబ్లీ,కలెక్టరేట్లముట్టడి ఉద్యమాలకు ముగింపు పలకాలి. తెలంగాణ బహుజనుల పాలనకై ఐక్య బహుజన రాజకీయ ఓటు చైతన్యంతో బహుజన ఓటు బదలాయింపువిధాన నిర్ణయంతో బహుజన మెదళ్లలో నిశ్శబ్ద విప్లవమై మేల్కొల్పాలి. బహుజన జన్ జడ్ ప్రజాస్వామ్య రాజ్యాంగబద్ధమైన ఉద్యమానికి సన్నద్ధం కావలసిన సమయం ఆసన్నమైనది. దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీల రిజర్వేషన్ల రద్దుకు మరో కొత్త ఉద్యమానికి తెరలేపుతున్నారు, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వాళ్ళే రిజర్వేషన్ పొందుతున్నారు,అది కూడా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు నీళ్లు వదిలి ఈడబ్ల్యూఎస్ ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత కులాలకు 10% రిజర్వేషన్ విద్యా,ఉద్యోగాలలో వారి జనాభా శాతానికి మించి రిజర్వేషన్ కల్పించబడింది. రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ ఉన్నప్పటికీ ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ లకు వారి జనాభాకు తగిన రిజర్వేషన్ కల్పించబడలేదు. బీసీ ప్రజల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది, కేంద్ర విద్యా ఉద్యోగాలలో స్వతంత్రం వచ్చిన 46 సంవత్సరాలకు గాని చాలీచాలని 27% రిజర్వేషన్ వి.పి.సింగ్ ప్రభుత్వం యొక్క చొరవ వలన కల్పించబడింది, అదేవిధంగా రాష్ట్రంలో కూడా స్వాతంత్రం వచ్చిన 26 సంవత్సరాలకు గాని 25% రిజర్వేషన్ బీసీలకు కల్పించారు. రిజర్వేషన్స్ రాజ్యాంగ మౌలిక సూత్రాలలో భాగం. ఎవరి దయాదాక్షిన్యాలతో కల్పించబడినవి కావు.

ఎస్సీ,ఎస్టీ,బీసీల రిజర్వేషన్ అనే వరకు ఒక తప్పుడు ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఒక వర్గం యొక్క సంపదను ప్రయోజనాలను, అవకాశాలను మరొక వర్గానికి మళ్ళించారని ఒక తప్పుడు ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఈ దేశంలో ఎస్సీ ఎస్టీ బీసీలుగా పిలువబడుతున్న ప్రజలు శతాబ్దాలుగా విద్యపరంగా,సామాజికంగా వెనకబడిన వర్గాల ప్రజలు, అట్టడుగు వర్గాల ప్రజలు,నిర్లక్ష్యం చేయబడి, అణచివేయబడి, విజ్ఞానాని కి, సంపదకు, అవకాశాలకు దూరం చేయబడి, కనీస మానవ హక్కులకు నోచుకోని ఈ దేశ మూలవాసులైన ప్రజలు, మధ్యయుగంలో బానిసలుగా బతికారు, ఆధునిక యుగంలో కులవృత్తులతో సమాజ సంపదను సృష్టించారు, స్వతంత్ర భారతదేశంలో మోసగించబడ్డారు కాబట్టే, స్వతంత్ర భారతదేశంలో ప్రజలందరికీ సమాన హక్కులను,అవకాశాలను కల్పించాలనే సదుద్దేశంతో భారత రాజ్యాంగంలోని 340, 341,342 ఆర్టికల్స్ ప్రకారంగా బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలను గుర్తించి విద్యా,ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం,అభివృద్ధిలో భాగస్వామ్యం, సమాన అవకాశాలు కల్పించడానికి రాజ్యాంగబద్ధమైన చర్యగా బాబాసాహెబ్ అంబేద్కర్ భావించారు , అంతే కాని ఇప్పుడున్న ఏ పార్టీలు కానీ ఏ నాయకుల దయా దాక్షిణ్యాలతో ఈ యొక్క రిజర్వేషన్స్ కల్పించబడినటువంటివి కావు. రిజర్వేషన్స్ అంటే రాజ్యాంగ మౌలిక సూత్రాల లక్ష్య సాధనా స్ఫూర్తి సాధనంగా రాజ్యాంగం చేత గుర్తించబడి అమలు చేయబడుచున్న రాజ్యాంగబద్ధ హక్కు. దేశ ఉత్పత్తి సాధనాలలో, దేశ అభివృద్ధి సంపదలో, దేశ పాలనా విధాన నిర్ణయాలలో,ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ ప్రజలు తగిన భాగస్వామ్యం పొందే వరకు రిజర్వేషన్స్ కొనసాగవలిసిందే. ఇంకెంతకాలం రిజర్వేషన్స్ అని కూడా బలంగానే ప్రశ్నమొదలైంది. రిజర్వేషన్స్ 10 సంవత్సరాల కాలం వరకే అంటూ,రాజ్యాంగం అమలులోకి వచ్చి 77 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఎందుకు కొనసాగుతున్నవని ప్రశ్నిస్తున్నారు. అవును రిజర్వేషన్స్ 10 సంవత్సరాల వరకే అనే విషయం ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయానికి సంబంధించినది మాత్రమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి,అందుకొరకే ఇట్టి రాజకీయ రిజర్వేషన్స్ ను 1960 నుంచి రాజ్యాంగ సవరణల ద్వారా పొడిగిస్తూ ఇటీవల 2019లో 104 వ రాజ్యాంగ సవరణ ద్వారా 2030 వరకు రాజకీయ ప్రాతినిధ్యరిజర్వేషన్ పొడిగించబడినది. అదేవిధంగా విద్యా, ఉద్యోగాలలో 15 (4) 16 (4) ప్రకరణల ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ ప్రజలకు కల్పించబడిన రిజర్వేషన్ కు రాజ్యాంగంలో కాల పరిమితి సూచించబడలేదు. 79 సంవత్సరాల పాలనా కాలంలో రాష్ట్రంలో అటు దేశంలో,కొన్ని ఆధిపత్య కులాలే ఏకచక్రాధిపత్యంగా దేశపాలనను కొనసాగిస్తూ, దేశ సంపదనంతా కొందరి వ్యక్తుల చేతుల్లో చేరవేసి,దళిత, వెనుకబడిన, గిరిజన,మైనారిటీ వర్గాల ప్రజలందరినీ, దేశంలోని అన్ని రంగాలలోని అభివృద్ధిలో, రాజకీయరంగంలో ఉద్యోగ అవకాశాలలో, పరిశ్రమల రంగంలో, ఉత్పత్తి సాధనాలలో సమాన ప్రాతినిధ్యాన్ని, అవకాశాలను కల్పించలేకపోయారు, దేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక,ఆర్థిక రాజకీయ సమానత్వాన్ని అందించి అభివృద్ధి చెందిన వర్గాల ప్రజలతో సమానంగా తీర్చిదిద్ద లేకపోయారు కాబట్టే ఈ వర్గాల ప్రజలకు రిజర్వేషన్స్ ను విధిగా కొనసాగించవలసిన పరిస్థితులు ఏర్పడినవి. రాష్ట్రంలో 93% ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ బహుజనులే, 79 సంవత్సరాలుగా రాజకీయ అధికారానికి దూరం చేయబడ్డవారు. 58 సంవత్సరాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 7% ఉన్న ఉన్నత కులాలు, 1% వున్న కమ్మలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను 15 సంవత్సరాలు పాలించారు,0.4% వున్న వెలమలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను 4 సంవత్సరాలు,తెలంగాణరాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పాలించారు. 4.8% వున్న రెడ్లు 37 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని మూడు సంవత్సరాలు మొత్తం 40 సంవత్సరాలు రెడ్లు పాలించారు,తొలి హైదరాబాద్ రాష్ట్రాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను 0.9%వున్న బ్రాహ్మనులు 5 సంవత్సరాల 10 నెలలు పాలించారు. 1.4% వున్న వైశ్యులు ఒక సంవత్సరం పాటు పాలించారు, ఎస్సీలు రెండు సంవత్సరాల కాలం పరిపాలించారు. రాష్ట్రంలో సుమారు 60% ఉన్న బీసీ ప్రజలు రాజకీయ అధికారాన్ని సాధించలేకపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను ఏలిన ఆ రెండు ఉన్నత కులాలే వెలమలు 10 సంవత్సరాలు రెడ్లు గత మూడు సంవత్సరాలుగా తెలంగాణను పాలిస్తున్నారు. తెలంగాణలో జరిగిన పోరాటాలన్నీ సాయుధరైతాంగ పోరాట నుంచి మొదలుకొని ఈనాటి పోరాటాల వరకు ఈయొక్క రెండు అగ్రకులాలకు అధికారాన్ని కట్టబెట్టిన ఉద్యమాలే తప్ప బహుజనులకు రాజకీయ అధికారాన్ని అందించే ఉద్యమాలు ప్రారంభమె కాలేదంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. బహుజన జన్ జెడ్ ఉద్యమం బహుజనుల రాజకీయ అధికార సాధనే లక్ష్యంగా కొనసాగాలి. ఏడు దశాబ్దాలుగా బహుజన వర్గాల ప్రజలు, అగ్రకుల పార్టీల దయా దాక్షిణ్యాలతో ఇచ్చేపదవులతో, లోన్లు పెన్షన్లు, సంక్షేమ పథకాలకు సంతృప్తి చెంది, ఇంతకాలం రెండు ఆధిపత్య కులాలకు రాజకీయ అధికారాన్ని కట్టబెట్టే బహుజన ఓటు బ్యాంకును గంపగుత్తగా వేసి రాజకీయ అధికార పీఠాన్ని అప్పగించి సంబరాలు చేసుకునే బానిస విధానానికి స్వస్తి పలకాలి.రాజ్యాంగ స్ఫూర్తితో బహుజనుల ఓటు,బహుజన జన్ జడ్ పాలనకే అన్న రాజకీయ నినాదంతో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు మన ఓటు-మన పాలన నినాదంతో సరికొత్త సామాజిక ఉద్యమం ఇంటి నుంచి గ్రామానికి, మండలానికి చేరి నియోజకవర్గాన్ని చుట్టి పట్టణాలకు పాకాలి. ఓసారి నీ జాతి పాలనకై మీ ఓటు వేసి చూడు పాలకుల కోటల్లో ప్రళయమై పేలుతుంది, ఓసారి మీ బహుజనులను అధికారపీఠమెక్కించి చూడు మరో కొత్త చరిత్రకు ప్రాణం పోస్తుంది.



అక్కల బాబు గౌడ్, బీసీ చైతన్య వేదిక




# బ్యాటరీల విప్లవం... వ్యర్థాల విస్ఫోటం!

ప్రపంచం కాలుష్య రహిత భవిష్యత్తు వైపు పరుగులు తీస్తోంది. విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్ వంటి పచ్చని సాంకేతికతలు కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి వెనుక మరో ఆందోళనకరమైన ప్రశ్నఎ నిలుస్తోంది. అదే... లిథియం అయాన్ బ్యాటరీ వ్యర్థాల సమస్య. నేటి ఆధునిక జీవనంలో మొబైల్ ఫోన్ల నుంచి విద్యుత్ వాహనాల వరకు బ్యాటరీలు కీలక శక్తి వనరులుగా మారాయి. కానీ వాటి జీవితకాలం ముగిసిన తర్వాత వాటిని సక్రమంగా రీసైక్లింగ్ చేయకపోతే భవిష్యత్తులో పర్యావరణానికి తీవ్రమైన ముప్పు తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఐఐటీ మద్రాస్ కెమిస్ట్రీ విభాగం పరిశోధకులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాబోయే సంవత్సరాల్లో బ్యాటరీ వ్యర్థాలు భారీ స్థాయిలో పేరుకుపోయే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే శాస్త్రీయ రీసైక్లింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ప్రపంచానికి హెచ్చరిక అంచనాల ప్రకారం 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సుమారు 1.1 కోట్ల మెట్రిక్ టన్నుల లిథియం బ్యాటరీ వ్యర్థాలు పేరుకుపోయే ప్రమాదం ఉంది. అదే సమయంలో సౌర విద్యుత్ విస్తరణతో పాత సోలార్ ప్యానళ్ల వ్యర్థాల సమస్య కూడా పెరగనుంది. అయితే ప్రస్తుతం ప్రపంచ బ్యాటరీ రీసైక్లింగ్ సామర్థ్యం చాలా పరిమితంగా ఉంది. కేవలం 5 నుంచి 6 శాతం వరకు మాత్రమే రీసైక్లింగ్ జరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే పర్యావరణ సమస్యతో పాటు విలువైన ఖనిజాల కొరత కూడా ఎదురయ్యే అవకాశం ఉంది. వాడేసిన బ్యాటరీలు కేవలం చెత్త కాదు... అవి విలువైన ఖనిజాల నిల్వలు. రీసైక్లింగ్ ద్వారా లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి వంటి లోహాలను తిరిగి పొందవచ్చు. బ్యాటరీలను శుద్ధి చేసిన తర్వాత లభించే నల్లటి పదార్థాన్ని 'బ్లాక్ మాస్' అంటారు. ఇది కొత్త బ్యాటరీల తయారీకి అవసరమైన ముఖ్యమైన ముడి పదార్థంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం బ్యాటరీ తయారీకి అవసరమైన అనేక ఖనిజాల కోసం భారత్ విదేశాలపై ఆధారపడుతోంది. ముఖ్యంగా కోబాల్ట్ వంటి అరుదైన లోహాల కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. రీసైక్లింగ్ వ్యవస్థ బలపడితే ఈ ఆధారపడటం తగ్గి, దేశ ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుంది. బ్యాటరీ వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపేందుకు ఐఐటీ మద్రాస్ ఆధునిక సాంకేతికతలపై పరిశోధనలు చేస్తోంది. తమిళనాడు విద్యుత్ బోర్డుతో కలిసి బ్యాటరీ శక్తి నిల్వ, రీసైక్లింగ్ విధానాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. లిథియం బ్యాటరీలు అత్యంత దహనశీలమైనవి కావడంతో వాటి నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. దీనికి ద్రవ ఆధారిత హైడ్రోమెటలర్జికల్ సాంకేతికతలను ఉపయోగిస్తూ సురక్షితమైన రీసైక్లింగ్ విధానాలపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రీసైక్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచి రోజుకు వెయ్యి కిలోల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రయోగాలు జరుగుతున్నాయి.

చైనా, యూరప్ దేశాలు బ్యాటరీ రీసైక్లింగ్‌లో ముందంజలో ఉన్నాయి. చైనా పాత బ్యాటరీల నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి ఖనిజాలను తిరిగి పొందుతూ కొత్త బ్యాటరీల తయారీలో ఉపయోగిస్తోంది. యూరప్‌లో బ్యాటరీ తయారీ సంస్థలకే వాటి జీవితాంత నిర్వహణ బాధ్యతలను అప్పగించే విధానాలు అమలులో ఉన్నాయి. అమెరికా ఆధునిక సాంకేతికతలతో బ్యాటరీలను సురక్షితంగా విడదీసి విలువైన పదార్థాలను తిరిగి పొందుతోంది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా పరిశోధన, పునర్వినియోగ విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. విద్యుత్ వాహనాల విస్తరణ ఎంత అవసరమో, వాటి నుంచి వచ్చే వ్యర్థాల నిర్వహణ కూడా అంతే ముఖ్యం. కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి సమగ్ర రీసైక్లింగ్ వ్యవస్థను నిర్మించాల్సిన సమయం వచ్చింది. సాంకేతిక ప్రగతి ప్రకృతికి భారంగా మారకుండా, భూమికి మేలు చేసే సాధనంగా నిలవాలంటే బాధ్యతాయుతమైన వినియోగం తప్పనిసరి. బ్యాటరీలు రేపటి ప్రపంచానికి శక్తినిస్తాయి.. కానీ వాటి వ్యర్థాలను జాగ్రత్తగా నిర్వహించినప్పుడే ఆ శక్తి భవిష్యత్ తరాలకు ఉపయోగం.




శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9133947176


రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.